

ఎయిడ్స్ బాధితుల పట్ల చిన్నచూపు వద్దు

సిహెచ్‌ఓ జాలాది విల్సన్ బాబు

ప్రజాశక్తి - గణపవరం

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపట్ల చిన్న చూపు చూడవద్దని గణపవరం సిహెచ్‌ఓ జాలాది విల్సన్ బాబు అన్నారు. శనివారం అర్ధవరంలో గుడ్ లాంఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐఇసి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, వ్యాధి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆయన వివరించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులతో కలిసి మెలిసి జీవించే విధంగా ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఎయిడ్స్ యాక్ట్ 2017 ఎఆర్‌టి మందులు ఎపిఎస్ఎసిఎస్ యాఫ్ టోల్‌ఫ్రీ నెంబరు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం గుడ్ లాంఫ్ ప్రాజెక్ట్ ఒఆర్‌డబ్ల్యూపి సాగర్ ఎంఎల్‌హెచ్‌పిఎస్ దివ్యభారతి, హెల్త్ అసిస్టెంట్లు జి.కృష్ణంరాజు, ఎఎన్ఎం లక్ష్మీ కాంతం, టి.అఖిల, 104 సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

ఆశాల భర్తీలో పాలి'ట్రిక్స్'..!

ఏప్రిల్ మొదటి వారంలో నోటిఫికేషన్ విడుదల

ఏలూరు జిల్లాలో 55, పశ్చిమలో 65 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

విహెచ్ఎస్ఎన్‌సి కమిటీ ముగ్గురిని ఎంపికచేసే ప్రక్రియ ఎప్పుడో పూర్తి

డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో ముందుకు సాగని ప్రక్రియ

రాజకీయ జోక్యంతోనే ఆశాల పోస్టుల భర్తీ నిలిచిపోయినట్లు ప్రచారం

జిల్లా కలెక్టర్లు ఎందుకు పట్టించుకోవడంలేదని చర్చ



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ఆశా వర్కర్ల ఖాళీల భర్తీకి సంబంధించి జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారు. జూన్ నెలాఖరుకు ప్రక్రియ పూర్తి కావాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నప్పటికీ ఇప్పటివరకూ ఎందుకు పూర్తి చేయలేదు. విహెచ్ఎస్ఎన్‌సి కమిటీ ముగ్గురిని ఎంపిక చేసే ప్రక్రియ పూర్తి చేసి జాబితా పంపించినా డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో ఫైల్ ఎందుకు కదలడం లేదు. ఆశా వర్కర్ల భర్తీకి సంబంధించి జిల్లా కలెక్టర్లు పట్టించుకోకపోవడానికి రాజకీయ జోక్యమే ప్రధాన కారణమా' అన్న ప్రశ్నలు అందరినీ వేధిస్తున్న పరిస్థితి నెలకొంది. ఆశా వర్కర్ల ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధించి 2025 ఏప్రిల్ ఏడో తేదీన ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. రూరల్, అర్బన్, ట్రైబల్ ఏరియాలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఏలూరు జిల్లాలో ఖాళీ పోస్టులు 55 ఉండగా ఇందులో రూరల్‌లో 50, ట్రైబల్ ఏరియాలో నాలుగు, అర్బన్‌లో ఒక పోస్టు ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 65 పోస్టులు ఖాళీలు ఉన్నట్లు పేర్కొనగా ఇందులో రూరల్ ప్రాంతంలో 28 పోస్టులు, అర్బన్‌లో 37 పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జూన్ 15వ తేదీ నాటికి ఎంపిక ప్రక్రియ మొత్తం పూర్తి చేయాలని, ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన జాబితాను జూన్ 30వ తేదీకి రాష్ట్ర కార్యాలయానికి పంపించాలని ఆరోగ్య శాఖ జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొంది. దీనికి అనుగుణంగా ఆశా వర్కర్ల భర్తీకి అధికారులు చర్యలు చేపట్టారు. నిబంధనల ప్రకారం ప్రతి ఆశా పోస్టుకు సంబంధించి వచ్చిన దరఖాస్తులన్నీ రూరల్ ప్రాంతంలో అయితే గ్రామ పరిధిలోని విహెచ్ఎస్ఎన్‌సి (విలేజ్ హెల్త్ అండ్ శానిటేషన్ కమిటీ)కి, అర్బన్‌లో అయితే యుహెచ్ఎస్ఎన్‌సి (అర్బన్‌హెల్త్ అండ్ శానిటేషన్ కమిటీకి)కి చేరతాయి. ఈ కమిటీలో గ్రామ సర్పంచితోపాటు, కార్యదర్శి, వార్డు మెంబర్లు, ఎఎన్ఎం అంగన్‌వాడీ టీచర్ ఇలా మొత్తం పది మంది వరకూ మెంబర్లు ఉంటారు. వచ్చిన దరఖాస్తుల్లోంచి ముగ్గురిని ఎంపిక చేసి ఈ కమిటీ డిఎంహెచ్‌ఒ (జిల్లా ఆరోగ్యశాఖ అధికారి) కార్యాలయానికి పంపించడం జరుగుతోంది. ముగ్గురిలో మెరిట్ ఉన్న ఒక అభ్యర్థిని డిఎంహెచ్‌ఒ కార్యాలయ అధికారులు ఎంపిక చేసి జిల్లా కలెక్టర్‌కు ఫైల్ పంపించి ఎంపిక ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉంటుంది. గ్రామ, అర్బన్‌స్థాయిలోని కమిటీలు ముగ్గురు అభ్యర్థులను ఎంపిక చేసి జాబితాను జిలా ఆరోగ్యశాఖ కార్యాలయానికి ఎప్పుడో పంపడం జరిగింది. ఇప్పటి వరకూ ఎంపికైన అభ్యర్థుల ఫైనల్ జాబితా మాత్రం ప్రకటించలేదు. దీంతో అధికారుల తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రాజకీయ జోక్యంతోనే కలెక్టర్లు మౌనం వహిస్తున్నారా?

ఆశా వర్కర్ల ఎంపికలో రాజకీయ నాయకుల జోక్యం కారణంగా తుది జాబితా విడుదల కాలేదన్న చర్చ నడుస్తోంది. ఎంపిక కమిటీలు పంపించిన ముగ్గురి జాబితాలో తమకు నచ్చిన వారిని ఎంపిక చేయాలని ఎంఎల్‌ఎలు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. మెరిట్ ఆధారంగా కాకుండా రాజకీయ నాయకులు చెప్పినట్లు ఎంపిక ప్రక్రియ పూర్తిచేస్తే తీవ్ర విమర్శలు వచ్చే అవకాశం ఉండటంతో జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు ఫైల్‌ను ముందుకు కదపడం లేదని సమాచారం. ఆశావర్కర్ల పోస్టుల భర్తీకి సంబంధించిన అంశంలో జిల్లా కలెక్టర్లే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీనిపై జిల్లా కలెక్టర్లు ఎందుకు చొరవ చూపడం లేదన్న చర్చ సర్వత్రా నెలకొంది. నిబంధనల ప్రకారం ఆశా వర్కర్ల భర్తీని పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ ఎందుకు పూర్తి చేయడంలో అర్థంకావడం లేదు. జిల్లా కలెక్టర్లు సైతం రాజకీయ నాయకులు ఒత్తిడికి తలొగ్గరా అన్న అనుమానాలు నెలకొన్నాయి. ఆశా వర్కర్లు పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఆ పనిని పక్కన ఉన్న ఆశా వర్కర్లకు అప్పగిస్తున్నారు. దీంతో వారంతా పనిభారంతో నలిగిపోతున్నారు. పని సకాలంలో పూర్తిచేయడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా అధికారులు మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా ఆశా వర్కర్ల పోస్టుల భర్తీపై తీవ్ర తాత్సారం కొనసాగిస్తున్నారు. దరఖాస్తు దారులు సైతం ఉద్యోగం కోసం ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. ఆశా వర్కర్ల తుదిజాబితాను వెంటనే విడుదల చేయాలని వారంతా కోరుతున్నారు.

ఫైనల్ జాబితా తయారైంది.. కలెక్టర్ వద్ద పెట్టాల్సి ఉంది..

వెంకట్, డిస్ట్రిక్ కమ్యూనిటీ మొబలైజర్ అధికారి

ఆశావర్కర్ల పోస్టుల భర్తీకి సంబంధించి ముగ్గురు ఎంపికతో కూడిన జాబితా జిల్లా కార్యాలయానికి వచ్చింది. ఎంపికైన అభ్యర్థుల ఫైనల్ జాబితా తయారు చేయడం పూర్తయ్యింది. జిల్లా కలెక్టర్ వారికి జాబితా పెట్టాల్సి ఉంది. అది పూర్తయిన తర్వాత ఎంపిక జాబితా విడుదల చేయడం జరుగుతోంది.



మాట్లాడుతున్న కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ

రైతు శ్రేయస్సే లక్ష్యంగా ముందుకు

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ, ఎంఎల్ఎ, కలెక్టర్

ప్రజాశక్తి - ఉండి

రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, రైతు శ్రేయస్సే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనితీరు ఉందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. శనివారం ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకం వర్చువల్ విధానంలో ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి, మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే ఆహార పంటలను దేశంలోని రైతులు పండించినట్లయితే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై ప్రతి రైతూ దృష్టి పెట్టాలన్నారు. ఇప్పటివరకూ ప్రభుత్వం అందించే 36 రకాల పథకాలన్నింటినీ కలిపి ప్రధానమంత్రి ధన్ ధాన్య కషి యోజన పథకం లో తీసుకొచ్చారని ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టులుగా సత్యసాయి, అనంతపురం, అన్నమయ్య, అల్లూరి సీతారామరాజు జిల్లాలను ఎంచుకున్నారని వారు తెలిపారు. ఎంఎల్ఎ రామాంజనేయులు మాట్లాడుతూ రైతులు వ్యవసాయంపైనే కాకుండా వాణిజ్య పంటలపై దృష్టి సారించి స్వయం సమృద్ధి దిశగా పయనించాలన్నారు. శాస్త్రవేత్తలు ప్రజలు తినే సన్న బియ్యం రకాన్ని అభివృద్ధి చేయకుండా మిగిలిన వంగడాలపై దృష్టి సారించడం సరి కాదన్నారు. శాస్త్రవేత్తలు రైతులకు ఏ సమయంలో ఏ పంటలు వేయాలో అవగాహన కల్పించాలని సూచించారు. కెవికె ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎన్.మల్లికార్జునరావు మాట్లాడుతూ రైతులకు అంతర పంటలపై అవగాహన కల్పించాలనేద్దేశంతో 250 ఎకరాల పంటకు మినుము విత్తనాలను, 25 ఎకరాలలో వేరుశనగ విత్తనాలను, 50 ఎకరాల్లో నువ్వుల విత్తనాలను ఈ సంవత్సరం అందించామని అన్నారు. అనంతరం కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతులను బలోపేతం చేసి వారిని ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంకణ బద్ధులై పనిచేస్తున్నాయని, అందుకోసం 60 వేల కోట్ల రూపాయలు కేటాయిసోందని తెలిపారు.

గ్రామ సర్పంచి పట్ల కెవికె అధికారుల నిర్లక్ష్య వైఖరి..


మహిళా సర్పంచిను కార్యక్రమంలో ఆహ్వానించే విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా ఆమె పేరుతో కాకుండా వేరే పేరుతో పిలవడం పట్ల సర్పంచి ఆగ్రహం వ్యక్తంచేశారు. తన పదవీకాలం పూర్తవుతున్నప్పటికీ తన పేరు అధికారులకు తెలియకపోవడం వారి నిర్లక్ష్యాన్ని తెలుపుతుందన్నారు. దీనిపై పలువురు నాయకులు అసహనం వ్యక్తం చేస్తూ ప్రోటోకాల్ పాటిస్తూ గ్రామ ప్రథమ పౌరురాలిని తొలుత స్టేజి పైకి పిలవకపోవడం దారుణమని, అధికారులు నిర్లక్ష్యంగా ఉండటం సరికాదని అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఉంటేనే ప్రభుత్వ పథకాలు ప్రజల వద్దకు వెళ్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి వై.నూకరాజు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కల్లుగీత వృత్తిని నిర్వీర్యం చేస్తే పాలకుల భవిష్యత్ ప్రశ్నార్థకమే..

కల్తీ మద్యం పరిశ్రమల దారులపై పీడీ యాక్ట్ పెట్టాలి

గీత కార్మికులకు ఆదరణ పథకం అమలు చేయాలి

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహామూర్తి



మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నరసింహామూర్తి

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రంలో కల్లుగీత వృత్తి లేకుండా చేయాలనుకుంటే పాలకుల భవిష్యత్తు ప్రశ్నార్థకమని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహామూర్తి హెచ్చరించారు. కల్తీ మద్యం పరిశ్రమదారులపై పీడీ యాక్ట్ పెట్టాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ జడ్జిలతో కల్తీ మద్యం పరిశ్రమలపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఉన్న 75 వేల అక్రమ బెల్ట్ షాపులు ఎందుకు తొలగించడం లేదో చెప్పాల్సిన అవసరం కూటమి ప్రభుత్వానికి ఉందన్నారు. భీమవరం సిఐటియు కార్యాలయంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహామూర్తి మాట్లాడుతూ ఎన్నో పోషక విలువలున్న అనేక జబ్బులకు వైద్యంగా ఉపయోగపడే ప్రకృతి సహజ సిద్ధమైన తాటికల్లును కూటమి ప్రభుత్వం కనుమరుగు చేసిందన్నారు. కల్తీ మద్యాన్ని, అక్రమ మద్యాన్ని కుటీర పరిశ్రమలుగా రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో నడుపుతున్నారంటే కొందరి పెద్దల ప్రయోజనాలు ఉన్నట్లుగా తెలుస్తోందన్నారు. గీత వృత్తి ప్రమాదమని తెలిసినా కుటుంబాలను పోషించుకోవడానికి లక్షల మంది గీత కార్మికులు ఈ వృత్తి చేస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా కిస్తీలు రద్దు చేసి గీత గృత్తిని లేకుండా కనుమరుగు చేయాలని గతంలోనే నిర్ణయం తీసుకున్నారన్నారు. ఎన్నికల్లో ఓట్లు కోసం అనేక వాగ్దానాలు చేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తలరాతలు మారుస్తారేమో అని నమ్మి ఓట్లేసిన పాపానికి ప్రభుత్వం గీత కార్మికులకు చుక్కలు చూపిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలోని 75 వేల అక్రమ బెల్ట్ షాపులను తక్షణం తొలగించాలని, కల్తీ మద్యాన్ని అరికట్టి కల్లును ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి మాట్లాడుతూ తాటి కల్లులో ఉన్న పోషకాలను ప్రచారం చేయాలని, కల్లుకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని, కల్లుగీత కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వంలో కల్లు అమ్మకాలు లేక వృత్తిలో బతకలేక ఉన్న ఊరు, కన్నతల్లిని, భార్య పిల్లలను వదిలేసి ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు బొక్క చంటి, కడలి పాండు మామిశెట్టి నాగభూషణం, జిల్లా కమిటీ సభ్యులు బొంతు శ్రీను, జక్కంశెట్టి సత్యనారాయణ, చింతపల్లి చిన్న వీరాస్వామి, దొంగ సత్యనారాయణ, ఆర్.సాంబశివరావు, కె.బాలాజీ, తుంగ సాయిబాబు పాల్గొన్నారు.

పాలకొల్లులో భారీ వర్షం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో శనివారం తెల్లవారుజాము 3 గంటల నుంచి 2 గంటలకు పైగా కుంభవృష్టి వర్షం కురిసింది. దీంతో వివాహ వేడుకలకు సిద్ధమైన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ శబ్దాలతో మెరుపులతో పిడుగులు పడ్డాయి. ఎక్కువగా వివాహాది శుభ కార్యక్రమాలు ఉండడంతో వీటి కోసం వేసిన పందిళ్లు తడిసి ముద్దయ్యాయి. జనం ఇబ్బందులు పడ్డారు.

ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవల విస్తరణకు ప్రణాళికలు

నెఫ్రాలజీ విభాగాన్ని ప్రారంభించిన ఎంఎల్ఎ రాధాకృష్ణ



ఆసుపత్రిలో నెఫ్రాలజీ విభాగాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ రాధాకృష్ణ


ప్రజాశక్తి - తణుకు

కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు విస్తరించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. తణుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో స్థానిక యాపిల్ ఆసుపత్రి సహకారంతో మూత్రపిండాల సమస్యకు సంబంధించి వైద్యులను కన్సల్టెంట్‌గా ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ మేరకు ఎంఎల్ఎ శనివారం ఆసుపత్రిలో నెఫ్రాలజీ విభాగాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి శనివారమూ తణుకు ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉంటూ కిడ్నీ సమస్యలకు సంబంధించి అన్ని పరీక్షలూ నిర్వహిస్తారని తెలిపారు. ఇందుకు అనుగుణంగా వారికి కావాల్సిన వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా యాపిల్ ఆసుపత్రి యాజమాన్యానికి ఎంఎల్ఎ రాధాకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చెవిటి పరీక్షలు చేయడానికి అత్యాధునికమైన బెరా మిషనరీ రాధాకృష్ణ ప్రారంభించి మాట్లాడారు. సదరం ద్వారా వెనుకటి సమస్యలు ఎదుర్కొంటున్న వారికి పరీక్షలు చేసేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. సుమారు రూ.20 లక్షల వ్యయంతో ఈ పరికరాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంఎల్ఎ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి వైద్యులతో పాటు యాపిల్ ఆసుపత్రి యాజమాన్యం, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమవరంలో సూపర్ జిఎస్‌టి బెన్ఫిట్ బజార్ ఏర్పాటు

ఈ నెల 13 నుండి 19వ తేదీ వరకూ కాస్మోపాలిటన్ క్లబ్‌లో నిర్వహణ

కలెక్టర్ చదలవాడ నాగరాణి



ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకూ భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో జిల్లా యంత్రాంగం చొరవతో భీమవరం సూపర్ జిఎస్‌టి బెన్ఫిట్ బజార్‌ను ఏర్పాటు చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవడ నాగరాణి కోరారు. బజార్లో వివిధ వస్తువులను తగ్గింపుపై అమ్మకాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటల నుండి రాత్రి 9 గంటల వరకూ బజార్ తెరిచి ఉంటుందని, ప్రవేశం ఉచితమని తెలిపారు. దీపావళికి ముందు ఈ ఉత్సవం నిర్వహించడం ద్వారా పన్ను సంస్కరణలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించడంతోపాటు, స్థానిక వ్యాపార భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేలా తోడ్పడుతుందని తెలిపారు. వినియోగదారులకు పండుగ సీజన్ డిస్కౌంట్లు, కాంబో ఆఫర్లు, బోనాంజాలు కూపన్లు కూడా అందజేయడం జరుగుతుందన్నారు. ఎలక్ట్రానిక్స్, ఉపకరణాలు, ఎంఎస్ఎంఎలు, స్టార్టప్‌లు, హస్తకళలు, చేనేత, వస్త్రాలు, ఫ్యాషన్ వస్తువులు, గృహోపకరణాలు, తదితర వస్తువులను మెగా డిస్కౌంట్‌తో అమ్మకాలు జరుగుతాయన్నారు. 19న గ్రాండ్ ఫినాలేగా దీపావళి దియా లైటింగ్ వేడుక, రాఫెల్ డ్రాలు, బహుమతులు, లక్కీ బొనాంజాలు అందజయనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు, వ్యాపార ప్రతినిధులు, వినియోగదారులు విజయవంతానికి కృషి చేయాలని కోరారు.

ఎస్‌జిఎఫ్ గేమ్స్‌లో మెరిసిన ఆదిత్య విద్యార్థులు



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థులు క్రీడలలో పాల్గొనడం వల్ల మానసిక ఉద్దేశ్యం కలుగుతుందని ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి తెలిపారు. స్థానిక శశి కాలేజ్ ఆవరణలో ఈనెల 9, 10 తేదీలలో జరిగిన ఎస్‌జి ఎఫ్ గేమ్స్‌లో పట్టణ ఆదిత్య స్కూల్ విద్యార్థులు సత్తా చూపినట్లు పాఠశాల ప్రిన్సిపల్ కె.వాసుదేవ తెలిపారు. అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగంలో కబడీ, యోగా, చెస్, కోకో, 100 మీటర్ల రన్నింగ్‌లో ఒక్కొక్కరు చొప్పున, 800, 1500 మీటర్ల రన్నింగ్‌లో ఇద్దరు, బ్యాడ్మింటన్‌లో 8 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ క్రీడలలో అత్యుత్తమ ప్రతి కనబరిచిన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు బి.పృథ్వి, పి.దుర్గాదేవి అభినందించారు.

అభివృద్ధికి కలిసి రండి

పరిశుభ్రతలో ఆకివీడుకి రాష్ట్రంలో 119 ర్యాంక్

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - ఆకివీడు


రాష్ట్రంలో ఉన్న 121 మున్సిపాలిటీలలో పరిశుభ్రత అభివృద్ధి సూచికలో ఆకివీడుకి 119వ స్థానం లభించిందని ఉండి ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తెలిపారు. పరిశుభ్రత అభివృద్ధి అంశాలపై చర్చించేందుకు గాను ఛాబర్ ఆఫ్ కామర్స్ సభ్యులతో శనివారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు, ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎంఎల్ఎ మాట్లాడుతూ మన పంచాయతీ రాష్ట్రంలో ఇంచుమించు చివరి స్థానంలో ఉందన్నారు. ఇంత దయనీయమైన అభివృద్ధి, పరిశుభ్రత మరెక్కడా ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో డ్రెయినేజీలు, చెత్త, ప్లాస్టిక్ లేకుండా నగర పంచాయతీని సుందరంగా రూపొందించుకుందామని, అందుకు అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈమేరకు చేపట్టవలసిన కార్యక్రమాలు, పలు అంశాలపై చర్చ కోసమే వ్యాపార సంఘాలను సమావేశపరచడం జరిగిందని ఆయన చెప్పారు. ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో కిరాణా, రైస్ మిల్లర్స్, ఫ్యాన్సీ వంటి మొత్తం 23 అసోసియేషన్‌లు ఉన్నాయని, వీరందరూ కదలి రావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ సమస్య తమదిగా భావించి బాధ్యత తీసుకోవాలన్నారు. గ్రామ మాజీ సర్పంచి, పెద్దింటి అమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ గుంట్ల గణపతి ఈ చర్చకు సమన్వయకర్తగా వ్యవహరించారు. చర్చను ఎంఎల్ఎ ప్రారంభించారు. సమస్యలందరికీ తెలుసు, సమస్య ప్రస్తావించినప్పుడు పరిష్కారం ప్రస్తావించే వాళ్లు మాత్రమే ముందుకు రండి అన్నారు. ముందుగా రైస్, ఆయిల్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాధాకృష్ణ మాట్లాడుతూ గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ, ట్రాఫిక్ వ్యవస్థ చాలా ఇబ్బంది కలిగిస్తున్నాయన్నారు. వాటికి గాను తమ వంతు సహకారం ఏ స్థాయిలో కావాలో తెలియజేస్తే ముందుంటామన్నారు. గ్రామంలో కిలోమీటరు కదలడానికి గంటలు తరబడి పడుతుందన్నారు. ఫిష్ ఫీడ్స్ అసోసియేషన్ నాయకులు గుర్రం అరవింద్ మాట్లాడుతూ పాలు, కోరలు టిఫిన్లు, హోటల్స్ ఒకటేమిటి ప్రతిచోట ప్లాస్టిక్ అనర్థంగా తయారైందన్నారు. వాటి నివారణకు ఉత్పత్తి స్థాయిలో నిలుపుదల చేసే ప్రయత్నం చేయాలన్నారు. ప్రస్తుతానికి మార్కెట్లో ఉన్న ప్రకారం వాటిని బయో టెక్నాలజీ దిశగా మరలా చాలన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి గుర్రం శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ ఉత్పత్తి పరిశ్రమల వద్ద హోల్‌సేల్ వ్యాపారుల వద్ద ముందుగా చేయాలని సూచించారు. మాంసం దుకాణాల వద్ద భారీగా ఈ సమస్య పెరిగిపోయిందని, అక్కడ చేతి గుడ్డ సంచులు అందించాలని అనగానే టిడిపి నాయకుడు గంధం ఉమా సత్యనారాయణకు ఆ బాధ్యత తీసుకోవాలని ఎంఎల్ఎ సూచించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు గొట్టుముక్కల సత్యనారాయణ రాజు మాట్లాడుతూ తాము ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు అందజేస్తామని ప్రకటించారు. అయితే తమ వాహనాలు కొనుగోలుదారుల వాహనాలు నిలుపుదలకి స్థలం కేటాయించాలని కోరారు. ట్రాఫిక్ సమస్యను ప్రస్తావిస్తూ స్వర్ణ వ్యాపారుల సంఘం అధ్యక్షులు కొప్పర్తి రవి అవసరమైతే స్థానిక ప్రభుత్వానికి తాము మనుషుల్ని సైతం అందిస్తామన్నారు. వెంటనే స్పందించిన ఎంఎల్ఎ ఎస్‌ఐని పిలిచి ప్రయివేట్ సెక్యూరిటీకి చెందిన నలుగురు వ్యక్తులను వారి నుండి తీసుకొని సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు మోటుపల్లి రామవరప్రసాద్, ఎఎంసి అధ్యక్షులు బొల్లం వెంకట్రావు, టిడిపి నాయకులు, అధికారులు, స్థానికులు, వ్యాపారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ, ఆశాలకు కనీస వేతనమివ్వాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలంగంశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - నరసాపురం

అంగన్వాడీ, ఆశా కార్యకర్తలకు, కాంట్రాక్ట్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కనీస భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలంగంశెట్టి సత్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు మండల మహాసభ జరిగింది. ఈ సభకు గుబ్బల రాజేశ్వరి, బొక్క ఆదిలక్ష్మి, పెనుగొండ జ్యోతి రత్నం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం పని గంటలు పెంచడం, కార్మికుల్ని, ఉద్యోగుల్ని బానిసలుగా చూడడం మార్చుకోవాలన్నారు. 200 సంవత్సరాల క్రితం పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సిఐటియు మండల సమన్వయ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా కవురు నరసింహస్వామి, కోకన్వీనర్‌గా గుబ్బల రాజేశ్వరి, బొక్క ఆదిలక్ష్మి కమిటీ సభ్యులుగా చింత రాజారెడ్డి, రావూరి మాణిక్యాలరావు, పులపర్తి రత్నకుమారి, పెనుగొండ జీవరత్నం, కొయ్య ఏసుబాబు, దొంగ రాజేశ్వరి మొదలగు వారిని ఎన్నుకున్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు నాగరాజు

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి


డాక్టర్ దాట్ల వెంకటరామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ దాట్ల వెంకటరామరాజు అన్నారు. శనివారం కాళ్లకూరు గ్రామం పేరంటాలమ్మ చెరువుగట్టున దేవీ నవరాత్రుల సందర్భంగా దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకటరామరాజు ముందుకు వచ్చి కనకదుర్గమ్మ తల్లి కథ నిమిత్తం రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ప్రతీ ఒక్కరూ ఏదోకరకంగా ఒత్తిడికి గురవుతున్నారని, దైవ చింతన అలవర్చుకోవాలని, దీనిద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పెన్మెత్స నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

ప్రజాశక్తి - నరసాపురం



గణపవరంలో హాస్టల్‌లో మాట్లాడుతున్న సిబ్బంది

మండలంలోని పెదమైనవానిలంక గ్రామంలో శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించి బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సిహెచ్.దుర్గా భవాని మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాలలో ముందు ఉండాలన్నారు. తల్లిదండ్రులకు, గురువులకు, పెద్దలకులోబడి ఒక గోల్ ఏర్పాటు చేసుకుని దానికి రీచ్ అవ్వటానికి కష్టపడాలన్నారు. బాలికలు చట్టాలు, భేటీ బచావో భేటీ పడావో, ఫోక్సో చట్టం, సైబర్ క్రైమ్, బాల్యవివాహాల నియంత్రణ చర్యలు, కేరీర్ గైడెన్స్‌లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఛైర్మన్ సిహెచ్.నరసింహస్వామి, అంగన్వాడీ సిబ్బంది హాజరైయ్యారు.

గణపవరం : ప్రపంచ బాలికల దినోత్సవం సందర్భంగా శనివారం గణపవరం పిహెచ్‌సి సిబ్బంది స్థానిక వెలంపేటలో గల ఎస్ఇ బాలికల హాస్టల్లో బాలికలకు ఆరోగ్యభద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిహెచ్‌ఎన్ సిహెచ్.సత్యవతి, ఎంఎల్‌హెచ్ పినున్నపాప, ఎఎన్ఎం ఐ.జయమ్మ మాట్లాడుతూ బాలికల పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. దీంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ ఉంచి విద్యపై కూడా దృష్టిపెట్టి విద్యావంతులుగా తయారు కావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ జాలాది విల్సన్‌బాబు, సోషల్ వెల్ఫేర్ కె.సూర్యకళ, హెల్త్ అసిస్టెంట్ ఎం.యేహన్, జి.కృష్ణంరాజు, ఎం.నల్లయ్య, ఆశాలు పాల్గొన్నారు.

కంటి ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం

నేత్ర వైద్యులు డాక్టర్ అహ్మద్ అలీ, దేగల స్వరూప్

ప్రజాశక్తి - పెనుమంట్ర

కంటి ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరమని అమరావతి నేత్ర వైద్యులు డాక్టర్ అహ్మద్ అలీ, డాక్టర్ దేగల స్వరూప్ అన్నారు. శనివారం మార్టేరు లోని రోటరీ క్లబ్ భవనంలో స్థానిక మానవత మండల శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో వారు పాల్గొని సుమారు 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కేవలం రూ.400లకు కళ్ల జోళ్లు ఇచ్చారు. అందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు శిరం విశ్వనాథం, బండి ప్రసాద్, జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణమూర్తి, అమృత వాక్కుల సత్యనారాయణ, చదువుల వెంకట నరేంద్ర, కర్రి కృష్ణారెడ్డి, పడాల జగన్నాధ రెడ్డి, నరసింహా రెడ్డి పాల్గొన్నారు.

ఉపసర్పంచి విమర్శలు అవాస్తవం

టిడిపి మండల నాయకులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణపై, మండలంలోని టిడిపి అధ్యక్షుడు మీద వైసిపికి చెందిన పెనుమంట్ర పంచాయతీ సర్పంచి, ఉప సర్పంచి చేస్తున్న విమర్శలు అన్నీ అవాస్తవమని మండలంలోని టిడిపి నాయకులు అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఈమేరకు టిడిపి మండల అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి, క్లస్టర్ కన్వీనర్ చింతపల్లి రామకృష్ణ, పెనుమంట్ర టౌన్ కమిటీ అధ్యక్షులు గంటా వాసు, పంచాయతీ 3వ వార్డు సభ్యులు సనమండ్ర సుధాకర్, బిసి సెల్ నరాల శెట్టి వెంకటేశ్వర రావు జరిగిన వాస్తవాలు వివరించారు. ఎంఎల్ఎ పితాని నియోజకవర్గం అభివృద్ధికి పార్టీలతో ప్రమేయం లేకుండా పంచాయతీ పాలకమండలితో కలుపుకు వెళ్తుంటే ఈ విమర్శలు తగవని వారు అన్నారు. పంచాయతీ ద్వారా జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక రాజకీయాలు, పార్టీల విభేదాలు ఉండకూడదన్న విషయం వైసిపి స్థానిక నాయకులు గ్రహించాలని వారు కోరారు.

కోడేరు వైసిపి గ్రామ అధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - ఆచంట

కూటమి అరాచక పాలనకు తగిన బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే రానున్నయని వైసిపి మండల కన్వీనర్ జక్కంశెట్టి చంటి అన్నారు. శనివారం కోడేరు గ్రామంలో వైసిపి గ్రామ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులుగా మామిడిశెట్టి సుబ్రహ్మణ్యంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి సీనియర్ నాయకులు సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి కోడేరు ఇసుకను అక్రమంగా తరలించుకుపోయారని ఆరోపించారు. గత పాలకులు ఇసుక ద్వారా వచ్చే ఆదాయంతో కోడేరు గ్రామాభివృద్ధికి సహకరించేవారని, ప్రస్తుతం తినుకో, దోచుకో, పంచుకో అనే రీతిలో స్థానిక ఎంఎల్ఎతో పాటు గ్రామంలోని టిడిపి నాయకులు ఇసుకను దోచేసుకున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో యూత్ అధ్యక్షులు లంకపల్లి సుందరరాజు, రైతు విభాగం అధ్యక్షులు మెడిది రెడ్డియ్య, ఎస్‌సి సెల్ అధ్యక్షులు కోట భాస్కరరావు, బిసి సెల్ అధ్యక్షులు మామిడిశెట్టి త్రిమూర్తులు, మహిళా విభాగం అధ్యక్షురాలు మైలే రాధతో పాటు 20 మందితో కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ముత్యాల నాగేశ్వరరావు, దేవరపు సూర్యనారాయణ, పమ్మి సురేష్ పాల్గొన్నారు.

రాజశేఖర్‌కు కేంద్రమంత్రి అభినందన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడిగా నియమితులైన బిజెపి తాడేపల్లిగూడెం రూరల్ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి రాజశేఖర్‌ను కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ అభినందించారు. భీమవరంలోని కేంద్రమంత్రి నివాసం వద్ద ఎస్‌సి ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ సమాజంలో అణగారిన తరగతులను ఉత్తేజితులను చేసి వారి వైపు విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడిగా నిలబడాలని సూచించారు. ఈ సందర్భంగా తనకు ఈ బాధ్యత అప్పగించిన కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బిజెపి మండల అధ్యక్షుడు సమయమంతుల కాశి, బిజెపి కార్యదర్శి నల్లూరి శ్రీనివాస్, ఆత్మ నిబర్, తాడేపల్లిగూడెం ఇన్‌ఛార్జి కొడవటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని ఆరేడు గ్రామంలోని శ్రీతాండవేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన ఆక్వా చెరువులపై చత్తీస్‌ఘడ్ రాష్ట్రం సుకుమా జిల్లాకు చెందిన బహదూర్ అనే యువకుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన సంకు నాగేశ్వరరావు, ఏలూరు వెంకట సుబ్బారావులు తాండవేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన చెరువులను లీజుకు వారి చెరువులపై పనిచేసే బహుదూర్ శనివారం సాయంత్రం చెరువులో మేతలు వేయడానికి వెళ్లగా విద్యుత్ షాక్ కొట్టి చనిపోయాడని తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పూర్తి వివరాలు తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

అందని ఆయుర్వేద వైద్యం..!

- వైద్యులు లేక వెలవెలబోతున్న వైద్యశాలలు
- ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్నా భర్తీ చేయని ప్రభుత్వం
- రోగుల అవస్థలు పట్టించుకోని వైద్యశాఖ



వల్లూరులోని ఆయుర్వేద వైద్యశాల

ప్రజాశక్తి - ఆచంట

ఆయుష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆయుర్వేద వైద్యశాలలో వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. ఏళ్ల తరబడి డాక్టర్లు లేక అలంకారప్రాయంగా మారి శిథిలావ్యవస్థకు చేరుకున్నాయి. ఆచంట మండలం వల్లూరు, ఆచంట గ్రామాల్లో ఆయుర్వేద వైద్యశాలలు ఉన్నాయి. వల్లూరు ఆసుపత్రికి సొంత భవనం ఉండగా ఆచంటలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిర్వహిస్తున్నారు. అన్ని వసతులు ఉన్నా డాక్టర్లు లేక పూర్తిస్థాయిలో సేవలు అందించలేకపోతున్నారు. వల్లూరులో మూడు దశాబ్దాల క్రితం, ఆచంట సిహెచ్‌లో సుమారు పదహారేళ్ల క్రితం ఆయుర్వేద వైద్యశాలలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రెండు వైద్యశాలలు మూతపడ్డాయి. ఈ వైద్యశాలకు రోజుకు 40 నుంచి 50 మంది వరకు రోగులు వచ్చేవారు. గతంలో ఉన్న ఆయుర్వేద డాక్టర్ బదిలీపై వెళ్లడంతో ఆ పోస్ట్ భర్తీ కాకపోవడంతో కొన్నాళ్లు ఆసుపత్రి కాంపౌండర్ పర్యవేక్షణలో నడిచాయి. ఆస్పత్రికి సొంత భవనం, విలువైన మందులు ఉన్నా అవి నిరుపయోగంగా మారాయి. వైద్యాధికారి లేక ఆసుపత్రికి రోగులు రావడం మానేశారు. ప్రస్తుతం ఆస్పత్రిని శుభ్రం చేయడానికి సిబ్బంది లేక పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ఆవరణమంతా చెత్త, చెట్ల ఆకులతో నిండి ఉంది. గతంలో వైద్యాధికారి నియమించాలని గ్రామసభల కార్యక్రమంలో విన్నవించినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని గ్రామస్తులు వాపోతున్నారు. మండలకేంద్రమైన ఆచంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గత పదహారేళ్ల క్రితం ఆయుర్వేద వైద్యశాలను ఏర్పాటు చేశారు. నాటి నుంచి దశాబ్ద కాలం వరకు కాంపౌండర్‌తోనే వైద్యశాలను నడిపించారే గాని వైద్యాధికారిని నియమించలేదు. పరిసర గ్రామాల నుంచి ఈ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు పెద్ద ఎత్తున రోగులు వస్తుండేవారు. నాటి నుంచి నేటి వరకు వైద్యాధికారి పోస్టు భర్తీ చేయలేదు. కేవలం కాంపౌండర్‌తోనే వైద్యశాల నడిపించేవారు. మండలకేంద్రం కావడంతో వివిధ గ్రామాల నుంచి అనేక మంది రోగులు వస్తుండేవారు. అయితే వైద్యాధికారి లేక అరకొరగా మాత్రమే రోగులు రావడంతో ఉన్న కాంపౌండ్ కూడా తొలగించడంతో ఆయుర్వేద వైద్యం మండల కేంద్రంలో అందని ద్రాక్షగా మిగిలిపోయింది. తక్షణమే అధికారులు స్పందించి ఆయుర్వేద హాస్పిటల్‌ను మరలా పునరుద్ధరించి వైద్యాధికారికారిని నియమించాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఆయుర్వేద వైద్యం రోగులకు అందని ద్రాక్ష

లంక శ్రీనివాసరావు, ఆచంట(ఆయుష్ ఎస్ఎన్ఒ)



ఆచంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ఆయుష్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఆయుర్వేద వైద్యశాలలో ఎనిమిది సంవత్సరాలు కాంపౌండర్‌గా పనిచేశాను. 2016 నుంచి ఆయుష్‌లో తీసేసారు. కనీసం జీతం కూడా ఇవ్వలేదు. కుటుంబ పోషణ భారమై కాఫీ హోటల్ లోనూ కొన్నాళ్లు పనిచేశాను. ప్రస్తుతం లాండ్రీ షాప్ నడుపుకుంటున్నాను. రోగులు మాత్రం రోజుకు 50 నుంచి 60 మంది వరకు వచ్చేవారు. చివరకు డాక్టర్ లేక ఆయుర్వేదం వైద్యం రోగులకు అందని ద్రాక్షగా మారింది.

మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నా

తాళం సత్యనారాయణ, వల్లూరు



మన సంప్రదాయాన్ని, సంస్కృతిని మిళితం చేసే ఆయుర్వేద వైద్యం అందించాలి. ఇంగ్లీష్ మందులు ఎన్ని వాడినా మోకాలు నొప్పులు, కీళ్ల నొప్పులు తగ్గడం లేదు. గతంలో వల్లూరులో ఆయుర్వేదం హాస్పిటల్ ఉండేది. రోగులు అధిక సంఖ్యలో వచ్చేవారు. డాక్టరు బదిలీపై వెళ్లడంతో చివరికి ఉన్న హాస్పిటల్ మూతపడింది. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆయుర్వేద హాస్పిటల్లో వైద్యాధికారులు నియమిస్తే బాగుంటుంది.

ఆయుర్వేద డాక్టర్‌ను నియమించాలి

గంగోలు శ్రీను, గాంధీనగర్, వల్లూరు



వల్లూరు ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ బదిలీపై వెళ్లడంతో ఆయుర్వేద హాస్పిటల్ మూతపడింది. డాక్టర్ లేకపోవడంతో ఆస్పత్రి నిరుపయోగంగా మారింది. మండల కేంద్రమైన ఆచంటలో కూడా వైద్యాధికారి లేక రోగులు అవస్థలు పడుతున్నారు. తక్షణమే వైద్యాధికారులను నియమించి ఆయుర్వేద హాస్పిటల్‌ను పునరుద్ధరించాలి.

ఆయుర్వేద హాస్పటల్ తెరవాలి

బొర్రా ధర్మారావు, వల్లూరు



నాణ్యమైన ప్రసిద్ధి చెందిన ఆయుర్వేద ఔషధాలు వాడటం వల్ల రోగాన్ని సమూలంగా నివారించడానికి కాకుండా శరీరానికి ఎటువంటి హాని చేయదు. ప్రపంచీకరణ నేపథ్యంలో మరలా ఇప్పుడిప్పుడే ఆయుర్వేద రంగానికి ప్రాధాన్యత లభిస్తుంది. మన సంప్రదాయాన్ని, సంస్కృతిని మిళితం చేసే ఆయుర్వేదాన్ని పున: స్థాపన చేసి భావితరాలకు ఆయుర్వేదంపై అవగాహన కలిగించాలి. తక్షణమే ఆయుర్వేద హాస్పిటల్‌ను తెరిపించి రోగులకు న్యాయం చేయాలి.

మహిళలకు నూతన వస్త్రాల బహూకరణ

ప్రజాశక్తి - కాళ్ల



నూతన వస్త్రాలు అందజేస్తున్న సాయివర్మ

మోడీ గ్రామంలో ఎస్‌టియు యూనియన్ ద్వారా మహిళలకు నూతన వస్త్రాలను గత ఎనిమిది సంవత్సరాల నుంచి అందజేయడం అభినందనీయమని మహిళలు హర్షం వ్యక్తంచేశారు. మోడీ గ్రామంలో 29 మంది మహిళలకు నూతన వస్త్రాలను ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి పెన్మెత్స సాయివర్మ మీదుగా శనివారం అందజేశారు. 2017 ఆగస్టు నుండి 2025 జూన్ వరకు కాళ్ల మండలం కలవపూడి మోడీ గ్రామంలోని ఎంపిపిఎస్ మోడీ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేసి ప్రస్తుతం ఎస్‌టియు జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శిగా ఉన్న పిఆర్‌విఎస్.సాయి వర్మ ఇటీవల బదిలీపై జక్కరం మోడల్ ప్రాథమిక పాఠశాలకు వెళ్లారు. సాయి వర్మ తాను 8 సంవత్సరాలు పనిచేసిన మోడీ గ్రామంలోని మిడ్ డే మిల్ సిబ్బందికి, విద్యా వాలంటీర్లకు, ఎఎన్ఎం స్టాఫ్‌కి, అంగన్వాడీ స్టాఫ్‌కి, గ్రామంలో పనిచేస్తున్న ఇతర మహిళా సిబ్బంది అందరికీ సుమారు 20 మందికి మహిళలకు ఎస్‌టియు జిల్లా శాఖ పక్షాన తన సొంత ఖర్చులతో రాబోయే దీపావళి పురస్కరించుకొని నూతన వస్త్రాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా కార్యదర్శి సిహెచ్.మోహన్ బాబు, ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి వేగేశ్న జానకీరామరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమార్ బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపుల తనిఖీ

ప్రజాశక్తి - నరసాపురం



నరసాపురంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

పట్టణ, మండలంలో ఎక్సైజ్ పోలీసులు శనివారం మద్యం షాపులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గతంలో మద్యం షాపులు నిర్వహించిన ప్రదేశాలు, దుకాణాలలో సోదాలు నిర్వహించారు. సిఐ ఎస్.రాంబాబు ఆధ్వర్యంలో పోలీసులు బృందాలుగా వీడి ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రాంబాబు మాట్లాడుతూ ఏడాది ఇప్పుడు వరకు మద్యం షాపులపై 117 కేసులు నమోదు చేశామన్నారు. వారి వద్ద నుండి 136 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుందామన్నారు. అన్ని మద్యం దుకాణాలలో ఐ యాప్‌ని ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు సిఐ రాంబాబు చెప్పారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం పట్టణంలో ఉన్న అన్ని మద్యం షాపులను తనిఖీ చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. ఇప్పటివరకు తాడేపల్లిగూడెం స్టేషన్ పరిధిలో గల 134 బెల్ట్ షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేసి వారి వద్ద నుండి 226.3 లీటర్ల మద్యము, 7.8 లీటర్ల బీరును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బెల్ట్ షాపు కేసులు నమోదుకాబడిన నిందితులందరినీ స్థానిక తహశీల్దార్ వారి కోర్టులో బైండోవర్ చేయడం జరిగిందన్నారు. తాడేపల్లిగూడెం స్టేషన్ పరిధిలో ఉన్న 40 మద్యం దుకాణాలలో ఎంఆర్‌పి ధరలకే మద్యం విక్రయించబడుతుందన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకు వచ్చిన ఎక్సైజ్ ఐయాప్ ద్వారా నిరంతరం మద్యం షాపులపై నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్టేషన్లోని సిబ్బందికి మద్యం షాపులు, ఎక్సైజ్ ఐ యాప్ ద్వారా నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలో ఎంఆర్‌పి ఉల్లంఘనకు పాల్పడుతున్న మద్యం షాపులపై కేసులు నమోదుచేయడం జరిగిందన్నారు. తాడేపల్లిగూడెం స్టేషన్ పరిధిలో మద్యం షాపుల యజమానులు సిండికేట్‌గా ఏర్పడలేదని, ఎవరికి వారే వ్యక్తిగతంగా తమ వ్యాపారాన్ని నిర్వహించుకుంటున్నారన్నారు. అన్ని మద్యం షాపులలో నిరంతరం తనిఖీలు నిర్వహించి షాపుల నుండి, బార్ అండ్ రెస్టారెంట్ల నుండి శాంపిల్స్‌ని తీసి ఎప్పటికప్పుడు రసాయన విశ్లేషణ జరిపిస్తున్నామని సిఐ తెలిపారు.

సమాజ సేవ అభినందనీయం

గన్నవరం ఎంఎల్ఎ యార్లగడ్డ వెంకట్రావు

కాళ్ల : పల్లె నుంచి ఉన్నత స్థాయికి వెళ్లిన వేగేశ్న రామకృష్ణంరాజు జన్మభూమి మమకారంతో సమాజ సేవచేయడం అభినందనీయమని గన్నవరం ఎంఎల్ఎ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. వేంపాడు గ్రామంలో మంచినీటి చెరువు వద్ద రూ.8.50 లక్షలతో నిర్మించిన మైక్రో ఫిల్టర్‌ను డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు, గన్నవరం ఎంఎల్ఎ యార్లగడ్డ వెంకట్రావులు శనివారం ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేసిన గన్నవరం ఎంఎల్ఎ యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ఎంఎల్ఎ పదవులు ముఖ్యం కాదని, ఉండి నియోజకవర్గాన్ని అన్నీ అభివృద్ధి చేస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అభినందనీయులన్నారు. ఈ కార్యక్రమంలో వేంపాడు గ్రామ సర్పంచి యిర్రింకి పద్మావతి శ్రీనివాస్, మాజీ సర్పంచి వేగేశ్న నారాయణరాజు కృష్ణరాజు, డాక్టర్ వేగేశ్న రామకృష్ణంరాజు, వేగేశ్న వంశీకృష్ణరాజు,(శ్రీ అభిరుచి), గ్రామ కార్యదర్శి సుంకర వెంకటేష్, టిడిపి మండల అధ్యక్షులు అరేటి వెంకట రత్నప్రసాద్, జనసేన మండల అధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు, గ్రామ టిడిపి అధ్యక్షులు వీరమల్లు వేణు గోపాల్, వీరమల్లు రమేష్, వీరమల్లు ఆంజనేయులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ నిధులతో పుంత రోడ్లు : ఎంఎల్ఎ

భీమవరం టౌన్: భీమవరం, వీరవాసరం మండలంలో మార్కెట్ యార్డ్ నిధులతో పుంత రోడ్లు వేయాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం మార్కెట్ యార్డ్‌లో శనివారం పాలకవర్గం మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు నిధుల కొరత లేదని, ప్రభుత్వ అనుమతి తప్పనిసరి కావడంతో పనులు జాప్యం అవుతున్నాయని, 20 శాతం నిధులైన తక్షణమే ఖర్చులు చేసి పుంత రోడ్లు వెంటనే వేయాలన్నారు. రైతులకు మేలు జరిగేలా మార్కెట్ యార్డ్ కృషిచేయాలని, పాలకవర్గం ఐకమత్యంతో పనిచేయాలని తెలిపారు. మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కలిదిండి సుజాత, వైస్ ఛైర్మన్ బండి రమేష్ మాట్లాడుతూ సభ్యులందరినీ కలుపుకుని మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషిచేస్తామని, రైతులకు అండగా ఉంటామన్నారు. అనంతరం పుంత రోడ్ల నిర్మాణానికి మార్కెట్ యార్డ్ నూతన సభ్యులు ఆమోదం తెలుపుతూ తీర్మానం చేశారు. ముందుగా యిర్రింకి సుధ రత్నకుమారి ఎంఎల్ఎ సమక్షంలో ఎఎంసి పాలకవర్గ సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సభ్యులు మైగపుల గంగారాం, చింతా కనకయ్య, రంగోల కృష్ణవేణి పాల్గొన్నారు.

దాతల సహకారం అవసరం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తణుకు

జిల్లాలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక వసతులతో భోజనశాల నిర్మించడం అభినందనీయమని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ప్రభుత్వ సహకారంతోపాటు దాతల సహకారం ఉంటేనే అభివృద్ధి త్వరితగతిన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ కరుటూరి సుబ్రహ్మణ్యం చౌదరి, నీలిమ దంపతులు ఆర్థిక సాయంతో సుమారు రూ.32 లక్షల వ్యయంతో నిర్మించిన భోజనశాల నిర్మాణాన్ని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలను ఎంఎల్ఎ అభినందించారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ పాఠశాల ప్రారంభించిన నాటి నుంచి కీర్తిశేషులు ఆరిమిల్లి వెంకటరత్నంతో పాటు ఆయన కుటుంబం పాఠశాల నిర్మాణానికి స్థలాన్ని సేకరించి దాతల సహకారంతో అనేక నిర్మాణాలు చేపట్టి ప్రస్తుతం అదే ఒరవడిని కొనసాగించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో సైతం ఇదే ఒరవడిని వేల్పూరు గ్రామ ప్రజలతోపాటు దాతలు ముందుకు వచ్చే పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయడానికి సహకరించిన మాజీ సర్పంచులు పెనుమర్తి సోమ సూర్యచంద్రరావు, వెంకటలక్ష్మి దంపతులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలి : ఎంఎల్ఎ



మాట్లాడుతున్న ఎంఎల్ఎ నాయకర్

మొగల్తూరు : రైతులకు నాణ్యమైన సేవలు అందించి సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ నూతన త్రిసభ్య కమిటీకి సూచించారు. మొగల్తూరులోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ఆవరణలో శనివారం త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా నిప్పులేటి తారక రామారావు, సభ్యులుగా మైలాబత్తుల రాంబాబు, కవురు నాగేశ్వరరావులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో నియోజకవర్గంలో 30 వేల ఎకరాల వరిసాగు చేసేవారిని ప్రస్తుతం 6 వేల ఎకరాల మాత్రమే సాగు జరుగుతుందన్నారు. దీనికి కారణం మురికి కాలువలు ప్రక్షాళన లేకపోవడమేనని, అన్నింటిని ప్రక్షాళన చేసేందుకు ఇక్కడున్న వారంతా సహకరించాలని ఆయన కోరారు. గత ప్రభుత్వంలో ధాన్యం సొమ్ము బకాయిలు సుమారు రూ.16 వేల కోట్లు చెల్లించండి అన్నారు. ముస్లిం, మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడు ఎం.ఎ.షరీఫ్ మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఘనంగా సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంఎల్ఎ కొత్తపల్లి జానకీరామ్, టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, వైఎన్ కళాశాల ఉపాధ్యక్షులు చిన్నమిల్లి సత్యనారాయణ, సొసైటీ సిఇఒ పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేయాలి : ఎంఎల్ఎ



జనసేనలో చేరుతున్న పలువురు

నరసాపురం: నియోజవర్గంలో పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేస్తే రానున్న రోజుల్లో పార్టీ మరింత బలపడుతుందని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో కొప్పరు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు పోలిశెట్టి శేషు, పోలిశెట్టి మధు, చిన్నమిల్లి బాబులు, అందే కవిలు ఆధ్వర్యంలో యాదంరెడ్డి సూరిబాబు, అందే భాస్కరరావు, కడలి ఏసుబాబు, గుబ్బల ఏడుకొండలు, కడలి ముత్యం జాయుడు, పీతల శాంసన్ సుమారు 200 మంది వైసిపి శ్రేణులు జనసేనలోకి చేరారు. ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి చిన్నా కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వర్ధనపు ప్రసాద్, కోటిపల్లి వెంకటేశ్వరరావు, ఆకన చంద్రశేఖర్, వలవల నాని, మైల వసంతరావు, వాతాడి కనకరాజు, బందెల రవీంద్ర, పోలిశెట్టి నళిని, అందే నరేన్ పాల్గొన్నారు.

దేవాలయాల ఛైర్మన్ల ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని పొలమూరు గ్రామంలో రెండు దేవాలయాలకు ఛైర్మన్ పదవులను నియమించగా శనివారం వారు ప్రమాణ స్వీకరించారు. శ్రీమార్కండేయ స్వామి ఆలయానికి ఛైర్మన్‌గా సుందర ధర్మారావు, శ్రీపట్టాభి రామాలయం ఆలయంకు ఛైర్మన్‌గా వేండ్ర దుర్గారావులతో నియోజకవర్గం టిడిపి యువ నాయకులు పితాని వెంకట్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు వెలగల బుల్లి రామిరెడ్డి, చింతపల్లి రామకృష్ణ, తోరం వెంకన్నబాబు, పెన్మెత్స వివేక రాఘవేంద్ర రాజు, అలీ జిన్నా, యామజాల విశ్వనాధం పాల్గొన్నారు.

'దాతల సహకారం ప్రశంసనీయం'

ఉండి : సుమారు కోటి రూపాయల వ్యయంతో నిర్మించే ఆలయ నిర్మాణానికి దాతలు సహకారం అందించడం ప్రశంసనీయమని స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. శనివారం ఉండి మండలం అర్తమూరు గ్రామపంచాయతీ శివారు కవిటంపాకలలో పురాతన శ్రీపద్మావతి గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయం పునర్నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్న కనుమూరి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ సుమారు కోటి రూపాయల విలువ చేసే స్థలాన్ని ఆలయానికి ఇచ్చిన దాత కానుబోయిన పెద్దిరాజు ఇతరులకు ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి గోనబోయిన వీర్రాజు, ఉప సర్పంచి గుడ్ల నారాయణ, ఎంపిటిసి దంగేటి రామలింగేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ కలిదిండి రామకృష్ణంరాజు, వైస్ ఛైర్మన్ ఎడవిల్లి వెంకటేశ్వరరావు, డిసి వైస్ ఛైర్మన్ మంతెన సాయి లచ్చిరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ప్రోత్సాహకరంగా విద్యానిధి ట్రస్ట్

ఉపకార వేతనాల పంపిణీలో ఎంఎల్ఎ రాధాకృష్ణ

తణుకు : చదువులో ప్రతిభ చూపిస్తున్న విద్యార్థులకు విద్యానిధి ట్రస్ట్ ద్వారా ఉపకార వేతనాలు అందిస్తూ వారిని ప్రోత్సహిస్తున్న దాతలను స్ఫూర్తిగా తీసుకోవాలని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చదువులో ప్రతిభ చూపిస్తున్న విద్యార్థులకు ఉపకార వేతనాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులకు సహకారం అందించాలనే ఉద్దేశ్యంతో ఈ ట్రస్ట్ ద్వారా అండగా నిలుస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తున్న విద్యానిధి ట్రస్టు సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ట్రస్టు ద్వారా నిరంతరం ప్రతి ఏడాది ఉపకార వేతనాలు అందించే విధంగా కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసి భవిష్యత్తులో మరింత మందికి అందించే విధంగా కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి పెనుమర్తి వెంకటలక్ష్మి, ట్రస్ట్ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

పాలకొల్లు రూరల్ : మంత్రి నిమ్మల రామానాయుడు స్వగ్రామమైన ఆగర్తిపాలెం గ్రామంలో శనివారం పోలేరమ్మ అమ్మవారి నూతన ఆలయం నిర్మాణానికి అమలాపురం లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్, వ్యాపారవేత్త, టిడిపి నాయకులు నున్నబోయిన శ్రీనివాసరావు, శైలజ దంపతులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామస్తులందరి సహకారంతో ఈ ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొని గ్రామస్తులకు శుభాభినందనలు తెలియజేశారు. ఆలయ నిర్మాణం తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు మాట్లాడుతూ తన స్వగ్రామంలో ఇలాంటి ఆలయ నిర్మాణం చేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలియజేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచి కావలి లక్ష్మీకుమారి, ఉపసర్పంచి కడలి శ్రీనివాసరావు, గుబ్బల లోహిదాసు, వీరవల్లి పితాజీ స్వామి, బొక్కా ఏసు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాణసంచా అక్రమ తయారీ, నిల్వ నేరం : డిఎస్‌పి

నరసాపురం : బాణసంచా అక్రమంగా తయారుచేసినా, వాటి నిలవలు ఉంచినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి జి.శ్రీవేద హెచ్చరించారు. మొగల్తూరు మండలం ముత్యాలపల్లిలో ఇంట్లో బాణసంచా తయారీ, అక్రమ నిలవలపై ఎస్ఐ జి.వాసు, సిబ్బందితో కలిసి దాడి చేసి సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి మాట్లాడుతూ గ్రామానికి చెందిన మామిడిశెట్టి బాబూరావు తన ఇంటివద్ద అక్రమంగా బాణసంచా తయారు చేస్తున్నట్లు సమాచారం అందగా తమ సిబ్బంది దాడి చేసి 2 వేల బాంబులు, పెటేబుల తయారీకి భారీస్థాయిలో తాటాకులు, నాలుగు కిలోల పేలుడు పదార్థాలు ఉండటాన్ని గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నామని డిఎస్‌పి తెలిపారు. బాధ్యుడిపై చట్టప్రకారం కేసు నమోదు చేశామన్నారు. బాణసంచా తయారు చేస్తూ వారితోపాటు కుటుంబ సభ్యులు, ప్రజల ప్రాణాలకు ముప్పుతెచ్చే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న బాణసంచా సామగ్రి సంబంధిత గోడౌన్లో భద్రపరిచి అనంతరం నాశనం చేస్తామన్నారు. ఈ సందర్భంగా డిఎస్‌పి ఎస్ఐ వాసు, కానిస్టేబుల్ కె.నాగేంద్ర బాబు, హోం గార్డ్స్ కె.శ్రీను, హేమంత్‌ను అభినందించారు.